కథ

# ఇది నరకం.... ఇది స్వర్గం....!!

- పాలకోడేటి సత్యనారాయణ రావు

నాదో చిత్రమైన సమస్య !

గత అయిదేళ్ళ నుంచీ నన్నీ సమస్య వేధిస్తూనే వుంది. బహుశా ఇంకో నాలుగేళ్ళపాటూ ఈ వ్యధ ఉంటుందేమో...... ఇంత ఇబ్బంది పడటం దేనికీ.... ఏ ఆస్పత్రికో వెళ్లి, ప్రముఖ వైద్యుడికో చూపించుకుంటే సరిపోతుంది గదా అని మీరు ఓ ఉచిత సలహా ఇవ్వదలిచారేమో.... క్షణం ఆగండి, నా సమస్య ఏమిటో మీకూ చెప్తాను.... అది విన్నాక, మీరే చెప్పండి నేనేం చేయాలో....

ఇంతకీ నా సమస్య ఏమిటంటే..... నేను మరో నలభై నెలల్లో రిటైర్ కాబోతున్నా !

ఇందులో సమస్య ఏముందీ..... పుట్టిన రోజునే మనకు రిటైర్‌మెంట్ డేట్ కూడా తెలుస్తోంది గదా..... స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగమైతే 58 ఏళ్ల తర్వాత.... సెంట్రల్ గవర్నమెంట్ వారి ఉద్యోగమైతే 60 ఏళ్ల తర్వాతకు.... ప్రైవేటు రంగంలో ఉద్యోగం లభిస్తే, ఆ యజమాని దయ ఉన్నంతవరకూ... ఎంతో అదృష్టం కలిసి వచ్చి పాలిటిక్స్‌లోకి వెళ్తే... అసలు రిటైర్‌మెంట్ కీర్తిశేషులయినప్పుడే....

కానీ మనం సామాన్యులం.... దొరికింది సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ మరి! అరవై ఏళ్లు నిండగానే రిటైర్‌మెంట్.... అదే ఇంకో నలభై నెలల్లో.... మరి, అన్నీ ముందే తెలిసినప్పుడు జీవితాన్ని సరిగ్గా ప్లాన్ చేసుకోవచ్చు గదా..... అనే కదా మీ ఉవాచ !

ప్లానింగ్.... నేను పుట్టిన ఈ దేశానికే లేదు ప్లానింగ్... అలాంటిది ఆ దేశ జనాభాలో ఒక భాగమైన నాకెందుకు ఉంటుంది. ప్లానింగ్.... అందుకే, గాలికి పెరిగినట్లు.... రోజు తర్వాత రోజుగా .... కాలం గడుపుతూ వచ్చానే తప్ప.... సరైన ప్లానింగ్ ఏదీ చేసుకోలేదు.

ఆలస్యంగానైనా కళ్లు తెరిచాను గదా.... ఆ ప్లానింగ్ చేసుకోవాలనే ఈతపన.... 'రిటైర్‌మెంటు ముందూ... ఆ తర్వాత' అని ఎవరైనా ఓ పుస్తకం రాసి ఉంటే దాన్ని చదివే పని గానీ... నాకు తెలిసి అలాంటివేమీ ఉన్నట్లులేవు!

అయినా నాకున్న మంచి మిత్రులు రఘురామ్, రామకృష్ణలను వెళ్ళి సంప్రదించా. రఘురామ్ నవ్వేశాడు. 'చెయ్యదల్చుకొంటే ఏమైనా చెయ్యొచ్చు.... రిటైర్‌మెంట్ రోజున ఆఫీసులో వీడ్కోలు సభ ఉంటుందిగదా.... ఈరోజు నుంచి ప్రతినెలా... అంటే వచ్చే నలభై నెలలూ.... నలభై సభలకు వెళ్లి.... అక్కడ రిటైర్ అయ్యేవాళ్లు ఏం చెప్తారో, రిటైర్ అయ్యాక ఏం చేయదలిచారో విని, ఓ కాగితం మీద రాసిపెట్టుకుంటే - అవి గైడ్‌లైన్స్‌లో ఉంటాయి గదా....! అన్నాడు మంచి సలహాయే !!

రామకృష్ణను కలిసాను సమస్య వివరించాను. రఘురామ్ ఏంచెప్పాడో అదీ చెప్పాను. 'రఘు అలా చెప్పాడా.... నేనొప్పుకోను... ఈ దేశంలో ఇంతమంది ఉన్నా ఎవడి జీవితం వాడిది! ఎవడి గొడవ వాడిది! వేరేవాణ్ణి చూసి మనం ఎలా బతుకుతాం.... మన జీవితాన్ని మనమే బతకాలి.... ఇన్నాళ్లూ ప్లానింగ్‌లేదని ఎలాగూ అన్నావ్ గదా.... ఇప్పుడైనా సొంత బుర్రతో, నీ సొంత జీవితానికో ప్లానింగ్ చేసుకో.... అంతేగాని.... నలభై నెలలపాటు ప్రతిసభకూ, సమావేశానికీ వెళ్లి, వాళ్ల జీవితాల్లోంచి ఏదో నేర్చేసుకొని, నీ జీవితాన్ని దిద్దేసుకోవాలనుకోకు..... ! అన్నాడు.

అమ్మో..... సమస్య ఇంకా తీవ్రమయిపోతోంది.... సొంత బుర్రతో ఆలోచించి అంటున్నాడు రామకృష్ణ.

అది సాధ్యమా ? మీ సంగతి నాకు తెలీదు గానీ.... నావల్ల జరిగేపనికాదు. ఏం చదవాలో మా అన్నయ్య నిర్ణయించాడు. ఏ ఉద్యోగానికి ఎలా దరఖాస్తు పెట్టాలో

*తగ్గిపోయిన జీతం... సరిపోని పెన్షన్...వేధించే అనారోగ్య సమస్యలు... పట్టించుకోని-కొడుకులు,కోడళ్లు... కూతుళ్లు ఉంటే వండగకు కొంచెం చొప్పున వాయిదాల్లో నంచుకుతినే అల్లుళ్లు.... అన్నీ సినిమా కష్టాలు.. ఎటొచ్చీ ఇవన్నీ నిజజీవితంలోనే....*

ఏపని ఎలా చెయ్యాలో ట్రైనింగ్‌లో నేర్పారు. సంపాదించే జీతాన్ని ఎలా ఖర్చు పెట్టాలో ఇప్పటికీ మా ఆవిడ నేర్పుతూనే ఉంది.... ఇక సరే, సెక్షన్‌లో ఏ ఫైలులో ఏ డ్రాఫ్టు ఎలా రాయాలో.... ఏ నోట్‌ను ఎలా పుటప్ చేయాలో, 'ప్లీజ్'ను ఎక్కడ రాయాలో, 'కైండ్లీ' ఎక్కడవాడాలో మా ఆఫీసర్లు నేర్పుతూనే ఉన్నారు. అలాంటిది.... సొంత బుర్ర వాడే అలవాటులేని నేను ఇప్పుడు, దాన్ని వాడమంటే ఎలాకుదురుతుంది.... అదెప్పుడో తుప్పు పట్టేసి ఉంటుంది గదా.... ఈ స్థితిలో దాన్ని తీసి దుమ్ము దులిపి, తుప్పు వదిల్చి... కష్టం బాబూ కష్టం!!

.... మరేం చేయాలి ?

చాలా ఆలోచిస్తే, నాకు మరో ఆలోచన తట్టింది. అదే అధ్యయనం.... స్టడీ ఇతరుల జీవితాన్ని చూసి అనుకరిస్తూ పోవటమే.... ఇది కొంచం తేలిక... ఆఫీసులో చేసే పని అదే గదా.... ఏ ఫైలును తీసినా.... మేం చేసేదేమిటీ..... 'టర్న్‌ది పేజ్ అండ్ లర్న్ ది వర్క్' అదే సూత్రం! పేజీలు వెనక్కు తిప్పి, గతంలో ఆ పనిని ఎవరు ఎలా చేశారో చూసి, ఆ ప్రకారమే మళ్లీ పేర్లూ పద్దులూ మార్చి అలాగే చేసేయ్యటం.... అయితే జీవితం ఓ ఫైలు కాదు... అందులోనూ రిటైరయిపోయినవారు ఏ ఒక్కరూ చేతికీ, మాటకూ అందుబాటులో ఉండరు కదా.... ఇంక మిగిలిన పద్ధతి ఒక్కటే - రిటైర్ అయిన వాళ్ల ఇంటికి వెళ్లి వాళ్ల సలహా సూచనలు అందుకోవటమే...

వెంటనే ఆ పనిలోకి దిగాను.... మెహిదీపట్నం అవతల మావాళ్లంతా కలిసి - వాళ్లు ఉద్యోగం చేసే రోజుల్లోనే ఓ కాలనీ కట్టుకొన్నారు. అక్కడికి వెళ్లాను - ఆ కాలనీలోనే ఉంటాడు మూర్తి.

మూర్తి ఇంటికి నేను వెళ్లేసరికి ఉదయం పదిన్నర అయి ఉంటుంది. కాలింగ్ బెల్ నొక్కి, గేటు బయటే వెయిట్ చేస్తున్నా....

ఎవరో ముప్ఫయి- ముప్ఫయి అయిదేళ్ల ఆవిడ వచ్చి గేటు తీసి 'ఎవరు కావాలి?' అనడిగింది.

'నేను... నాపేరు సుందరం.... నేనూ మూర్తీ కలిసే పనిచేశాం.... ఆయన... ఉన్నారా?....' అనడిగాను.

ఆవిడ 'మూర్తితో ఇప్పుడేంపని?' అన్నట్లు చూసి, ఆలోచనగా 'ఆయన నిద్రపోతున్నారు....' అంది.

నిద్ర... పదిన్నరకు... అంటే ఇంకా నిద్ర లేవనేలేదా... అయితే, రిటైర్‌మెంట్ తర్వాత ఇలాంటి సుఖ నిద్రకు అలవాటు పడచ్చునన్నమాట....

'లేపండి, పర్వాలేదు...' అన్నాను. ఆవిడ అదోలా చూసి, 'ఉండండి !' అంటూ లోపలికి వెళ్లిపోయింది. నేను బయటే నిలబడి ఉన్నాను. ఆ వచ్చిన ఆవిడ ఆయన కోడలై ఉంటే, రిటైర్‌మెంట్‌కు ఇది మరో కారణం... రిటైరయిన మామగారి ఫ్రెండ్స్ ఇంటి బయటే నిలబడి మాట్లాడాలి... కాబోలు!! - తప్పు... అది కాకపోవచ్చు, ఆవిడ అసలు నన్ను గుర్తించి ఉండకపోవచ్చు. ఎవరెవరో అపరిచితులు వచ్చేస్తే, ఇంట్లోకి రానివ్వటం ప్రమాదమనే భావనతో...

లోపల్నించి మూర్తి రావటంతో నా ఆలోచనలు ఆగిపోయాయి. 'రా... రా... సుందరం....!' అంటూ ఆయన బయట వరకూ వచ్చి, నా చెయ్యి పట్టుకుని, లోపలికి ఆహ్వానించాడు. ఆ స్పర్శలో నాకెన్నో అర్థాలు కనిపించాయి. ఇంట్లోని ఆప్యాయతా రాహిత్యం కూడా నాకు ఆ స్పర్శ ద్వారా తెలుస్తూనే ఉంది!

లోపలికి వెళ్లాం....

'చెప్పు... ఏంటి సంగతులు....' అన్నాడు మూర్తి.

ఇంక డొంకతిరుగుళ్లు ఏమీ లేకుండా నేరుగా నా సమస్య వివరించాను.

మూర్తి ఆలోచనలో పడ్డాడు... సోఫాలో వెనక్కు వాలాడు. 'నిజమే, ఈ దేశంలో ఇదో పెద్ద సమస్యే.... రిటైర్‌మెంట్ అనేది ఓ శాపంలా అయిపోయింది చాలామందికి !..... కానీ, నువ్వు మంచి పని చేస్తున్నావ్... ముందే మేల్కొన్నావ్... ఆఆలోచనల్లో పడ్డావ్... నేనూ అలా చేసి ఉండాల్సింది' అన్నాడు.

ప్లానింగ్.... నేను పుట్టిన ఈ దేశానికే లేదు ప్లానింగ్... అలాంటిది ఆ దేశ జనాభాలో ఒక భాగమైన నాకెందుకు ఉంటుంది. ప్లానింగ్.... అందుకే, గాలికి పెరిగినట్లు.... రోజు తర్వాత రోజుగా .... కాలం గడుపుతూ వచ్చానే తప్ప.... సరైన ప్లానింగ్ ఏదీ చేసుకోలేదు.

- నాకంతా అర్థమవుతోంది. ఉద్యోగం చేస్తున్నంత కాలం మూర్తికి జీవితమో స్వర్గంలా ఉండేది. ఇప్పుడంతా నరకం !! ఇంతకన్నా వివరంగా మూర్తి ఏం చెప్తాడు నాకు !!

తగ్గిపోయిన జీతం... సరిపోని పెన్షన్....వేధించే అనారోగ్య సమస్యలు... పట్టించుకోని కొడుకులు,కోడళ్లు... కూతుళ్లు ఉంటే పండగకు కొంచెం చొప్పున వాయిదాల్లో నంచుకుతినే అల్లుళ్లు.... అన్నీ సినిమా కష్టాలు.. ఎటొచ్చీ ఇవన్నీ నిజజీవితంలోనే....

జీవితం ఇంత కఠినంగా ఉంటుందా ?

రిటైర్ కావటానికి ముందే గుండె ఆగిపోతే బెస్ట్ కాబోలు... ఇలాంటి స్వచ్ఛంద జీవిత విరమణ పథకాలు ఉంటే ఎంత బాగుండేది .....!

మూర్తి చెప్తున్నది నా చెవుల్లోకి ఎక్కటం లేదు... నా ఆలోచనలు నావిగా ఉంటున్నాయి....

హఠాత్తుగా నా నోటి నుంచి 'మీ అబ్బాయి సరిగ్గా చూసుకోడా నిన్ను....?' అన్నమాటలు వెలువడ్డాయి... ఎందుకో నాకే తెలీదు, ఆ మాటలు ఎందుకు అన్నానో...!

మూర్తి ఆశ్చర్యంగా చూశాడు నాకేసి... 'నీకా అభిప్రాయం ఎందుకు కలిగింది...' అని నవ్వేసి, 'అయితే నేను చెప్తున్నది ఏదీ నువ్వు వినలేదన్నమాట.... సరే, ఇప్పుడైనా విను.... అబ్బాయి అసలీ దేశంలోనే లేడు. టాటా కన్సల్టెన్సీ ద్వారా అమెరికా వెళ్లాడు. అప్పుడే అయిదు నెలలయింది. ఆ అమ్మాయి మా కోడలు. పుట్టింటికి వెళ్లిపోవచ్చు... ఈ ఊరే... అయినా వెళ్లకుండా 'మిమ్మల్ని చూసుకోవాలి గదా!' అంటూ మాతోనే ఉంటోంది... అబ్బాయి ఎంత పంపిస్తాడో మేం అడగం... కానీ, ఆ అమ్మాయే మా అక్కౌంట్‌లో నెలకు ఐదు వందల డాలర్లు వేయమని అబ్బాయితో చెప్పింది. అంటే సుమారుగా ఇరవై... ఇరవైఅయిదువేలు... అదనంగా నా పెన్షన్... ఎఫ్.డి, జి.పి.ఎఫ్‌ల మీద వడ్డీ.... ఉద్యోగం చేస్తున్నప్పటి కన్నా..... ఇప్పుడే బాగుంది నాలైఫ్....!'

- ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు మూర్తి. అన్నీ ఆర్థికపరమైన లెక్కలే. ఈ లెక్కల్లో తప్పులేమో నాకు కనిపిస్తూనే ఉన్నాయి. రేపు.... మూర్తి కొడుకు తన భార్యతో సహా అమెరికాలో సెటిలయిపోతే.... అప్పుడు, నెలకు అయిదు వందల డాలర్లు ఆయన అక్కౌంట్లో క్రెడిట్ అవుతూనే ఉంటాయిగానీ... ఒంటరితనం ఆ తర్వాత ఆయన్నీ, వాళ్ల ఆవిడనూ వేధించుకు తినేస్తుంది. అప్పుడు చూడాలి ఆయన వేదన!

- ఊహూ... మూర్తి కాదు నాకు ఆదర్శం!

ఇంకెవరున్నారు.... చాలా ఆలోచించాను, అప్పుడు తట్టాడు నాకు మనోహర్!

ఉద్యోగం చేసే రోజుల్లో చాలా జాలీగా, హుషారుగా ఉండేవాడు. నలుగురితో నవ్వుతూ, తుళ్లుతూ, జోకులు వేస్తూ.... ఒక్కరోజు అతను అబ్సెంట్ అంటే - ఆ లోటు మాకు తెలిసిపోయేది. అన్నట్లు, నాకింకా గుర్తు..... రిటైర్ అయిన రోజున - వేపచెట్టు కింద మేం అతనికి వీడ్కోలు పలికేరోజున.... ఎమోషన్ ఆపుకోలేక కళ్లమ్మట నీళ్లు పెట్టుకొన్నాడు....' ఈ చెట్టు నీడన పెరిగిన మనిషిని. ఈ గాలిపీల్చి ప్రాణం నిలుపుకొన్న వాడిని. కష్టాలు, కన్నీళ్లు, నవ్వులు, ఆనందాలు... అన్నీ ఇక్కడే నేర్చుకొన్న వాడిని, నలుగురితో పంచుకొన్న వాడిని! ఇప్పుడు... ఇంత మందిని ఇక్కడ వదిలి, ఇక ముందు ఎలా బతుకుతానో, ఏమో!' అనుకొంటూ ఎంతో అప్‌సెట్ అయిపోయాడు.

వెళ్లి మనోహర్‌ను చూసి వస్తే.....

మర్నాడే మనోహర్ ఇంటికి వెళ్లాను. నేను వెళ్లేటప్పటికి సాయంత్రం అయిదూ, అయిదున్నర అవుతోంది. అతని ఇంటి చుట్టూ చిన్న ప్రహరీ గోడ. గేటులేదు గానీ, ఓ చిన్న వెదురు అల్లికల అడ్డం. నాకు దూరం నుంచీ మనోహర్ కనిపిస్తూనే ఉన్నాడు - పూల మొక్కలకు నీళ్లు పడుతూ !

నన్ను చూడగానే నీళ్లపంపు పక్కన పడేసి, రమ్మంటూ నన్ను లోపలికి ఆహ్వానించాడు. నన్ను కూర్చోబెట్టి, లోపలికివెళ్లి నీళ్లటాప్ కట్టేసి వచ్చాడు. ఇంట్లో అతనూ... వాళ్లావిడ.... అంతే ! ఇంకెవ్వరూ లేరన్నది అర్థమవుతోంది...

'ఏంటిలా వచ్చావ్ ?' అనడిగాడు ఆప్యాయంగా.

'మీ ఇంటికే... వెతుక్కొంటూ మిమ్మల్ని కలవాలనే వచ్చాను!' అన్నాను.

'ఎంత అదృష్టం ! మనం ఒకే ఆఫీసులో ఏళ్ల తరబడి పనిచేస్తాం కానీ ఒకళ్లంటే ఏమిటో మనలో ఏ రెండో వాడికీ తెలీదు... ఆఖరికి రిటైరయ్యే రోజున కూడా ఒక చోట చేరం మనం! ఒకేచోట, సన్నిహితంగా ఉంటూ పూర్తి అపరిచితుల్లాగ బతకటం మనకే సాధ్యం అనిపిస్తోంది.... అలాంటిది నువ్వు వెతుక్కుంటూ వచ్చావంటే, ఆశ్చర్యంగా ఉంటోంది!' అన్నాడు మనోహర్.

అతను అనే మాట ప్రతీది నిజం, కానీ నిజాన్ని భరించటం ఎవరికైనా కష్టం.... నాకూ అంతే !

మనసులో భావాల్ని కప్పిపుచుకోంటూ, నేను వచ్చిన పని ఏదో వివరించాను.

అయితే, ఇప్పటి నుంచే మొదలయిందన్నమాట... నీలో టెన్షన్ !....'

'టెన్షన్ గాదు....'

'పేరు ఏది పెట్టినా, అది అదే !.... జీవితంలో దేన్నీ మనం ఆపనూలేం, అడ్డుకోనూలేం, ;మరింకెందుకు టెన్షన్ అనిపిస్తుంది నాకు ! ఇద్దరు పిల్లలు నాకు! ఇద్దరూ ఈ ఊళ్లోనే ఉంటారు వాళ్ల వాళ్ల ఇళ్లలో - ఎవడి గొడవ వాడిది. ఆదివారం వీలైతే వచ్చి పలకరిస్తారు, లేకపోతే ఓ ఫోన్ చేస్తారు... అంతే.... మొదట్లో వాళ్ల ఫోన్ కోసం, ఆ తర్వాత వాళ్ల రాకకోసం ఎదురుచూసే వాళ్లం. ఇప్పుడదీ లేదు. వాళ్లొస్తే... తలుపుతీస్తున్నాం.... అంతే. వీళ్లను చూస్తోంటే వీళ్లకోసమేనా ఇంత తపనపడి పెంచాం. అనిపిస్తుంటుంది నాకు.... !'

- మనోహర్ మనసులో ఏదో కలుక్కుమన్నట్లుగా ఉంది. ఆగి కన్నీళ్లు తుడుచుకుంటూ అన్నాడు... 'అందుకే - వాళ్ల మీద ప్రేమ చంపుకొంటూ, నవ్వే పువ్వుల మీద ఆశలు పెంచుకొంటున్నా! రోజుకు రెండుపూటలా అదే పని.... చెట్లకు నీళ్లు పోయటం, ఆకు ఆకునూ పలకరించి రావటం.... వాటి నుంచి నేనూ ఏమీ ఆశించను... అవీ నానుంచి ఏవీ ఆశిస్తూ ఉండక పోవచ్చు...'

- ఇదంతా ఆకురాలే గొడవ!

నేనడిగింది, నేను ఆశించింది ఇదికాదు... రిటైర్‌మెంట్ తర్వాత ఎలా బతకాలో చెప్పమంటే, వీళ్లు రిటైర్మెంట్ తర్వాత పిల్లల మీద ఎలా ఆధారపడవచ్చో, ఎలా ఆధారపడకూడదో చెప్తున్నారు.

అసలు వీళ్లెవ్వరికీ నా సమస్య అర్థం కాలేదు. మరి వీళ్లు నాకు పరిష్కారం ఎలా చెప్తారని...

- అనవసరం. ఎవరినో అనుకరించటం, ఎవరినో అనుసరించటం కాదు కావాల్సింది.....

ఇది నా జీవితం! అవును.... నా జీవితం... జీవితం అంటే ఏమిటి.... జీవించగలగటం...

ఎలా జీవించటం? జీవించటానికి అసలు అర్థం ఏమిటి?

- ఇంతకాలం ఎలా జీవించానో అదే జీవితం!

ఉదయం నుంచీ సాయంత్రం ... రాత్రి... ఒక్కో సమయంలో అర్ధరాత్రి వరకూ.. పనిచేస్తూనే ఉన్నా! పని చేస్తూనే ఉన్నా.... జీవిస్తున్నా.....

అవును.... పని చేయటమే జీవితం!! పని చేయకపోతేనే నరకం !!

రిటైర్ అవకముందైనా.... రిటైర్ అయిన తర్వాతనైనా... జీవించటానికి ప్రతీక పని !!

.... నాకు ఇప్పుడు జ్ఞానోదయం అయింది. రిటైర్‌మెంట్ భయం ఇప్పుడు లేదు... ఇంకెప్పుడూ ఆ భయం నన్ను వెంటాడదు...!!

☆☆☆